## వరికుప్ప దగ్ధంతో రూ.60 వేలు నష్టం



**భట్టిప్రోలు(రేపల్లె), జనవరి 29, ప్రభాతవార్త:** మండలంలోని అద్దేపల్లికి చెందిన డొక్కు శివయ్యకు సంబంధించిన ఎకరం పొలంలో వరికుప్పను గురువారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు.దీంతో రూ.60 వేల నష్టం ఏర్పడింది.సంఘటనా స్థలాన్ని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా,భట్టిప్రోలు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు యడ్ల జయశీలరావు,డొక్కు శ్రీనివాసరావు,ఖమ్మం సుధీర్,డొక్కు వెంకటేశ్వరరావు తదితర రైతులు సందర్శించారు.బాధితుడిని పరామర్శించారు.బాధితుడు డొక్కు శివయ్య ఫిర్యాదు ఆధారంగా భట్టిప్రోలు ఎస్ఐ ఎం.శివయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# బాపట్ల జిల్లా వార్త

## ఎక్కువ పనిదినాలు కల్పించాలి



**నిజాంపట్నం, జనవరి 29, ప్రభాతవార్త:** పనిలేని సమయంలో కూలీలకు పని కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఉపాధి హామీ పథకంలో ఎక్కువ మందికి, అధిక పనిరోజులు కల్పించాలని ఎంపిడిఓ నాగలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లకు జరిగిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండలంలో అనేక గ్రామాలలోని నిరుపేదలకు మంజూరైన పక్కా గృహాల నిర్మాణం జరుగుతున్నదని వారు చేసుకుంటున్న పనికి ప్రభుత్వం కూలీ ఇస్తుందని వాటిని నమోదు చేయాలని ఆమె కోరారు. గుర్తించిన పనులను ప్రారంభించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణశాఖ ఎఇ లక్ష్మీనారాయణ, ఎపిఓ జయచంద్రకుమార్, టిఎ జాఫర్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**బాపట్ల,జనవరి29,ప్రభాతవార్త:** రైతులకు పశు భీమా పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రతి రైతు తప్పని సరిగా ఈ పథకాన్ని



సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖా అధికారి .వేణుగోపాల్ తెలిపారు.పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేది నుండి 31 వ తేది వరకు నిర్వహింపబడుతున్న పశు ఆరోగ్య శిబిరాలలో భాగంగా గురువారం తూర్పు పిన్ని బోయిన వారిపాలెం గ్రామంలో నిర్వహించారు.తొలుత పోస్టర్‌ను అవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ ఉచిత నట్టల నివారణ కార్యక్రమం గురించి పశుగ్రాసాలు పెంపు మరియు వాటి ఉపయోగాలు తెలిపారు. రైతులకు ఈ పశు భీమా పథకం చాలా ఉపయోగకరం అయన తెలిపారు. ఈ పథకాన్ని రైతు సోదరులందరూ ఉప యోగించుని లబ్ధి పోందాని ఆయన కోరారు.ఎడి ఎవిహెచ్ బాపట్ల డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పశుసంవర్ధకశాఖ అద్వర్యంలో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాలు గురించి రైతు సోదరులకు వివరించారుర. ఇందులో భాగంగా పశుకిసాన్ క్రెడిట్ కార్డు.పశు భీమా పథకం. లింగ నిర్ధారణ వీర్యం - ఆడదూడలు మాత్రమే పుట్టే సెమెన్ గురించి వివరించారు.ఈ శిబిరంలో 120పైగా గేదెలకు మరియు దూడలకు నట్టల నివారణ,35 పైగా పునరుత్పత్తికి సంబంధించి గేదెలను పరీక్షించినారు.అలాగే 15 కి పైగా చూడి నిర్ధారణ పరీక్షలు చేశారు.కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ గ్రామ ఉపాధ్యక్షులు రమేష్,మాజీ సర్పంచ్ బి వెంకట నారాయణ, జమ్ములపాలెం పశు వైద్యాధికారి డా. సాహిత్య,కెబిపాలెం జెవివో కె.కుమారి,గ్రామీణ పశు వైద్యశాలఎల్.ఎ ు బెనర్జీ,ఎహెచ్ఎ సంధ్యారాణి , కృష్ణకాంత్, గోపాల మిత్ర ఈశ్వర్,రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్త సమ్మెకు కార్మిక సంఘాలు సమాయత్తం

రేపల్లె-ప్రభాతవార్త

కేంద్రప్రభుత్వ విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాలు దశలవారీ పోరాటాలతో ముందుకు సాగుతున్నాయి.గత సంవత్సరం 21వ తేదీ దేశంలో లేబర్ కోడ్స్ అమలులోకి రావడంతో 29 కార్మిక చట్టాలు రద్దుకు దారితీశాయి.లేబర్ కోడ్స్‌ను వ్యతిరేకిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా,అఖిలపక్ష ట్రేడ్ యూనియన్లకు చెందిన 520 సంఘాలు ఫిబ్రవరి 12వ తేదీ భారతదేశ వ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయి.కార్పొరేటర్ల వత్తిడి కారణంగా కేంద్రపాలకులు లేబర్‌కోడ్స్‌ను అమలులోకి తెచ్చారని కార్మిక సంఘాలు ఆందోళన చేస్తున్నాయి.హక్కులను కాలరాస్తున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు.కేంద్ర ప్రభుత్వం మాత్రం లేబర్ కోడ్స్ ప్రాధాన్యత కలిగినవంటూ ప్రచారం కొనసాగించడాన్ని కార్మిక సంఘాలు జీర్ణించుకోలేక పోతున్నాయి.లేబర్ కోడ్స్ వ్యవహారం తమకు మేలు చేసేలా లేదని కార్మికులు వాదిస్తున్నారు.కార్మికులకు లేబర్‌కోడ్స్ ఉపయోగపడే పరిస్థితి లేదని కార్మిక సంఘాలు స్పష్టం చేస్తున్నాయి.త్రైపాక్షిక విధానంలో వేతనాలు పెంచుకునే ప్రక్రియకు లేబర్‌కోడ్స్ వలన తెరపడింది.కార్మికుల పనిదినాల విషయానికి వస్తే కార్మిక చట్టాల ప్రకారం రోజులో 8 గంటలు పనిచేయాలి.లేబర్ కోడ్స్ కారణంగా రోజులో 12 గంటలు పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.ఒకే దేశం ఒకే వేతనం పేరుతో జాతీయ కనీస వేతనం రోజుకు రూ.178 ప్రకారం వేతనాలు పెరగకపోగా లేబర్‌కోడ్స్ వలన తగ్గుతాయని కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి.ట్రేడ్ యూనియన్ రిజిస్ట్రేషన్ పూర్తిచేయాలంటే కనీసం ఏడుగురు కార్మికులు ఉండాలి.లేబర్ కోడ్స్ ప్రకారం 100 మంది కార్మికులు లేదా 10 శాతం మంది కార్మికులు ఉండాలని మార్చారా లేదా అని సంయుక్త కిసాన్ మోర్చా,అఖిలపక్ష ట్రేడ్ యూనియన్ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. పరిశ్రమల లేఆఫ్,లాకౌట్,మూసివేతలకు 100 మంది కార్మికులు ఉన్నా ప్రభుత్వ అనుమతులు ఉండాలి.లేబర్ కోడ్స్ ప్రకారం 300 మంది కార్మికుల లోపు పరిశ్రమలకు అనుమతులు అవసరంలేదు.ఈ నిబంధనతో 85 శాతం పరిశ్రమల కంపెనీలను యజమానులు ఇష్టారాజ్యంగా మూసివేయడానికి వీలేర్పడుతుంది.ఇప్పటి వరకూ ఈఎస్ఇ వర్తింపజే యాలంటే ఒక యజమాని కింద 10 మంది కార్మికులు పనిచేయాలి.అయితే 20 మంది కార్మికులు పనిచేస్తేనే ఈఎస్ఇ అమలయ్యే విధంగా లేబర్ కోడ్స్‌లో మార్పు చేశారంటూ కార్మిక సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఒక కాంట్రాక్ట్ ప్రాతిపదికన 20 మంది కార్మికులు పనిచేస్తే ఈఎస్ఇ,పిఎఫ్,బోనస్,కనీస వేతనాలతో సహా అన్ని హక్కులు వర్తించేవి.కార్మికుల సంఖ్యను 50 మందికి మార్చారు.భవిష్యత్తులో ఎటువంటి చట్టాలు కార్మికులకు వర్తించే పరిస్థితి ఉండదని ఆందోళన చెందుతున్నారు.రాష్ట్రాల వారీగా కొనసాగుతున్న సంక్షేమ బోర్డులన్నీ రద్దవుతాయి. నిర్మాణం,మైన్స్,ఉప్పు,బీడీ వంటి అనేక రంగాలకు ప్రత్యేక సెస్ ద్వారా కార్మిక సంక్షేమ బోర్డులు నడుస్తున్నాయి. వైద్య,విద్య,వివాహం,ప్రసూతికి సంబంధించి యాజమాన్యాలు చెల్లిస్తూ వస్తున్న వేల కోట్ల రూపాయల సెస్సులు లేబర్ కోడ్స్ నిబంధనల ప్రకారం యాజమాన్యాలు చెల్లించాల్సిన పన్లేదు.కార్మిక సంక్షేమ బోర్డులు రద్దవుతాయి.యాజమాన్య వ్యవస్థ ఆర్థిక ప్రయోజనం కోసమే లేబర్ కోడ్‌లలో కేంద్ర ప్రభుత్వం మార్పులు తీసుకువచ్చిందని కార్మిక సంఘాలు విమర్శిస్తున్నాయి.ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చేలా పేదలకు భద్రత లేకుండా చేశారని ఐఎన్‌టియుసి, ఎఐటియుసి,సిఐటియు, ఎఐఎఫ్‌టియు,ఐఎఫ్‌టియు,ఎస్‌కెఎమ్ తదితర సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.ప్రాణాలు పోయినా అణువిద్యుత్ యజమాని ఎటువంటి నష్టపరిహారం చెల్లించకుండా అణు విద్యుత్ చట్టాన్ని మార్పు చేశారు.పార్లమెంట్‌లో విద్యుత్ ప్రైవేట్,విత్తన సవరణ బిల్లులు చట్టాలు కావడానికి సిద్ధంగా ఉన్నాయని కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి. కార్మికులకు శిక్ష,యజమానులకు రక్షణగా లేబర్ కోడ్‌లు మారాయని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి.లేబర్ కోడ్స్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కేంద్ర ప్రభుత్వానికే మద్దతు ప్రకటించాయి. ఈ తరుణంలో కార్మిక సంఘాలు ఆందోళనబాటపట్టాయి. జనవరి 19న విజయవాడలో అఖిలపక్ష ట్రేడ్ యూనియన్లు,కిసాన్ సంయుక్త మోర్చా సమావేశం నిర్వహించారు.జనవరి 28వ తేదీ లోపు జిల్లా,రెవెన్యూ డివిజన్ స్థాయిలో సదస్సులను నిర్వహించారు.జనవరి 23-27 తేదీలలో సంబంధిత అధికారులకు సమ్మె నోటీసులనిచ్చే కార్యక్రమం పూర్తిచేశారు.ఫిబ్రవరి 9,10 తేదీలలో బైక్ జాతాలు, ఆటో ప్రచార జాతాలు నిర్వహించాలని సంఘాలు నిర్ణయించాయి.ఫిబ్రవరి 12న ప్రదర్శనలు,ర్యాలీలను నిర్వహిస్తారు.ఈ సమ్మె కార్యక్రమంలో రైతులు,కౌలు రైతులు,వ్యవసాయ కార్మిక సంఘాలతో సమన్వయం చేసుకోవాలని అఖిలపక్ష ట్రేడ్ యూనియన్లు, సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు పిలుపునిచ్చారు.

## హైవేండ్ స్కూల్ విద్యార్థులు చదువులోనే కాక క్రీడల్లో ప్రతిభ

**కర్లపాలెం,జనవరి29,ప్రభాతవార్త:** ఈనెల 26 ట్రేడ్ ఇంటర్నేషనల్ స్కూల్లో జరిగిన షూటింగ్ బాల్ సబ్ జూనియర్ బాపట్ల జిల్లాలో సెలక్షన్ విభాగంలో హైవేండ్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారని పాఠశాల మేనేజర్,డైరెక్టర్ బి.సాయి మహేంద్ర తెలిపారు.స్థానిక హైవేండ్ పాఠశాలలో



గురువారం డైరెక్టర్ మాట్లాడుతూ ఐదుగురు స్టేట్ మీట్‌కి సెలెక్ట్ అయ్యారన్నారు.ఎంపికైన విద్యార్థులు బి భాస్కర్, ఎస్ చరణ్, ఎం మహాలక్ష్మి, గీతిక, చందనలు వచ్చే నెల ఫిబ్రవరి 14 ,15 తారీకుల్లో పల్నాడు జిల్లా సత్తెనపల్లి లో నిర్వహించే అంతర జిల్లా షూటింగ్ బాల్ ఛాంపియన్షిప్‌లో పాల్గొంటారన్నారు.ఎంపికైన విద్యార్థులను పాఠశాల యజమాన్యం,తదితరులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడపడం ప్రమాదకరం

– మోటారు వాహనముల తనిఖీ అధికారిణి ఎన్.ప్రసన్న కుమారి

**బాపట్ల,జనవరి29,ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరు రోడ్డు నిభందనలుపాటిస్తే నే ప్రమాదాల నివారణ సాధ్యమోతుందని మోటారు వాహనముల తనిఖీ అధికారిణి ఎన్.ప్రసన్న కుమారి అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా జిల్లా రవాణా శాఖ అధికారి టి.కె.పరంధామ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు రహదారి భద్రత పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసన్న కుమారి మాట్లాడుతూ విద్యార్థులు రోడ్డు ప్రమాదాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు, ప్రతి ఒక్కరు రోడ్డు రూల్స్ పాటించినప్పుడే ప్రమాదాల





నివారణ పూర్తిగా సాధ్యమవుతుందని అన్నారు. యువత ఎక్కువగా ప్రమాదాలకు గురవు తున్నారని, రోడ్డు రూల్స్ పాటించక పోవడమే దీనికి కారణమన్నారు.విద్యార్థులు యాక్సిడెంట్స్ బారిన పడితే మంచి భవిష్యత్తు ను కోల్పోతారని, ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. 18 సంవత్సరాల నిండి వారు డ్రైవింగ్ లైసెన్స్ పొందే వరకు వాహనాలను నడపవద్దని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సైకాలజిస్ట్ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ మోటార్ సైకిల్ నడిపే ప్రతి ఒక్కరు విధిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడపడం ప్రమాదకరమని విద్యార్థులకు తెలిపారు. ఈ సమావేశంలో మెడికల్ ఆఫీసర్ ఎ.నరేంద్ర కుమార్ ఫస్ట్ ఎయిడ్ పై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ బి. కిషోర్ బాబు, బాపట్ల ఇంజనీరింగ్ కాలేజ్ ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ డి. నిరంజన్ బాబు,ఇంజనీరింగ్ కళాశాల సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను అధికారులు తెలుసుకుని పరిష్కరించాలి

**నిజాంపట్నం, జనవరి 29, ప్రభాతవార్త:** ప్రజల సమస్యలను తెలుసుకుని అధికారులు పరిష్కరించాలని మండలాధ్యక్షురాలు మోపిదేవి విజయనిర్మల అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిడిఓ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు మోపిదేవి హరనాథ్ మాట్లాడుతూ సమావేశంలో అనేక మంది తమ సమస్యలు తెలియజేస్తారని, ప్రశ్నిస్తారని వాటిని మనసులో పెట్టుకుని వారి పనులు చేయకుండా ఉండరాదని, సమస్యలను సత్వరమే పరిష్కరించి విధి నిర్వహణలో చిత్తశుద్ధితో






ఉండాలని కోరారు. ఈ సందర్భంగా కొత్తపాలెం సర్పంచ్ రవి, దిండి సర్పంచ్ రాంబాబు, కొత్తపాలెం ఎంపిటిసి సభ్యుడు గోపాలకృష్ణలు విద్యాశాఖలో ఉపాధ్యాయుల పనితీరును ప్రశ్నించారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయులపై నమ్మకం కలిగేలా ఉపాధ్యాయులు ప్రవర్తిస్తే పాఠశాలలో విద్యార్థుల చేరిక శాతం పెరుగుతుందన్నారు. రెవెన్యూ శాఖలో క్రిందిస్థాయి సిబ్బంది చేస్తున్న అనేక తప్పిదాలను, పలు సమస్యలను, లోటుపాట్లను లేవనెత్తారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ నాగలక్ష్మి, ఉపమండలాధ్యక్షులు తోటకూర సుబ్బారావు, ఉన్నవ వెంకటేశ్వరరావు, సర్పర్‌లు, ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 1,2తేదిలలో టైప్ రైటింగ్ పరీక్షలు

**రేపల్లె,జనవరి 29,ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా 36 కేంద్రాలలో ఫిబ్రవరి 1,2 తేదీలలో టైప్ రైటింగ్ పరీక్షలు జరుగుతాయని ఎపిటిసిఐఎ గౌరవాధ్యక్షుడు సి.వి.మోహనరావు తెలిపారు.గురువారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సాంకేతిక విద్య,శిక్షణ బోర్డు నిర్వహిస్తున్న ఇంగ్లీషు,తెలుగు,హిందీ,భాషలలో లోయర్ గ్రేడ్,హయ్యర్ గ్రేడ్,అదనంగా ఇంగ్లీష్ జూనియర్ గ్రేడ్ పరీక్షలకు 6 వేల మంది విద్యార్థులు హాజరవుతారని చెప్పారు. రేపల్లె పరీక్షా కేంద్రంలో మాత్రం ఫిబ్రవరి 1వ తేదీ మాత్రమే జరిగే పరీక్షలకు 45 మంది విద్యార్థులు హాజరవుతారని ఆయన తెలియజేశారు.రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 30,31 తేదీలలో 7 పరీక్షా కేంద్రాలలో షార్ట్ హ్యాండ్ పరీక్షలు జరుగుతాయన్నారు. ఇంగ్లీషు,తెలుగు,హిందీ భాషలలో జరిగే లోయర్ గ్రేడ్,ఇంటర్మీడియట్,హయ్యర్ గ్రేడ్,హైస్పీడ్ పరీక్షలకు 2 వేల మంది విద్యార్థులు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.పూర్తి



వివరాలకు టైప్ ఇనిస్టిట్యూట్స్ ప్రిన్సిపాల్స్,పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్స్‌ను విద్యార్థులు సంప్రదించాలని మోహనరావు కోరారు.

## వాహన దారులు తప్పని సరిగా రోడ్డు భద్రత నియమాలను పాటించాలి

**పిట్టలవానిపాలెం,జనవరి29,ప్రభాతవార్త:** వాహన దారులు తప్పని సరిగారోడ్డు భద్రతానియమాలను పాటించాలని చందోలు ఎస్ఐ వెంకటశివకుమార్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఉత్తర్వులు మేరకు బాపట్ల డిఎస్పి మరియు బాపట్ల రూరల్ సర్కిల్ సిఐ ఆదేశాల ప్రకారం ఎన్‌హెచ్ కార్యక్రమాన్ని గురువారం 216 రహదారిపై నాకా బంద్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ శివకుమార్ మాట్లాడుతూ బైక్ నడిపేటువంటి వ్యక్తి హెల్మెట్లను ధరించి వాహనాలను నడపాలన్నారు. హెల్మెట్ యొక్క ఉపయోగాలను తెలియపరిచారు. వాహనాల యొక్క పత్రాలను తనిఖీ చేసి సరియైన పత్రాలు లేని వాహనదారులకు చలానాలు విధించారు. వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను వాహనదారులకు తెలియజేశారు. అదేవిధంగా రాత్రి సమయాలలో వాహనాలు నడిబడేటటు వంటి వాహదారులకు ఫేస్ వాష్ కార్యక్రమాన్ని నిర్వహించి డ్రైవర్, క్లీనర్లకు నీరునిచ్చి ఫేస్ వాష్ చేసుకోని వెళ్లాలని సూచించారు. వాహనదారులకు





రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, హైవే పెట్రోలింగ్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ మాంసవిక్రయ దారులకి జరిమానా విధించిన ఎంహెచ్ఓ

**తెనాలి మున్సిపాలిటీ జనవరి 29(ప్రభాతవార్త):** అనధికారికంగా,బహిరంగ మాంస విక్రయ దారులకి మున్సిపల్ ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మొవ్వ ఏసుబాబు జరిమానా విధించారు. గురువారం పట్టణంలోని 17,18 వార్డు లలో పర్యటించి ఆయా వార్డు లలో జరుగుతున్న కాలువలు తీయుట,తడిచెత్త,పొడిచెత్త సేకరణ, వంటి పారిశుధ్య పనులను పరిశీలించి సిబ్బందికి



పలు సూచనలు చేశారు.అనంతరం కబేళా వంతెన వద్ద రోడ్ పైన బహిరంగంగా,మాంసం విక్రయాలు చేస్తున్న వారిని,బహిరంగ మాంసం విక్రయించ వద్దని, హెచ్చరించారు.మాంసం విక్రయ దారులు ముగ్గురికి 1000 రూపాయలు చొప్పున జరీమానా విధించారు.అనంతరం కబేళా ప్రాంగణాన్ని పరిశీలించి, ప్రాంగణమంతా శుభ్రంగా ఉంచు కోవాలని, సిబ్బందిని హెచ్చరించారు.ఆనారోగ్యంతో ఉన్న వాటిని,మృతి చెందిన వాటిని కోయవద్దని అలా చేస్తే కఠిన చర్యలు తప్పవని వారిని హెచ్చరించారు. ఎంహెచ్ఓ వెంట ఇంచార్జి శానిటరీ ఇన్స్పెక్టర్ ఎం.సుబ్బారావు, శానిటరీ సెక్రటరీలు, పాల్గొన్నారు.

## అబ్కారీ శాఖ అధికారిగా గీత కార్మికుని బిడ్డ

**వేమూరు జనవరి 29 (ప్రభాతవార్త) :** కల్లుగీత కార్మికునుగా జీవనాని సాధించే కార్మికుని కుమారుడు నేడు అబ్కారి శాఖ అధికారిగా ఉద్యోగం సాధించాడు. ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్ టు ఫలితాల్లో వేమూరు మండలం బలిజేపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు బెల్లంకొండ వెంకటేశ్వర రావు, రాఘవమ్మల కుమారుడు బెల్లంకొండ రామయ్య రాయుడు



ఎక్సైజ్‌శాఖ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా గ్రూపు 2 ఫలితాల్లో ఉద్యోగం సాధించాడు. సాధారణ కూలీగా పనిచేసే వెంకటేశ్వరరావు చదివించే స్తోమత లేకపోయినా తాను పడే కష్టం బిడ్డలు పడకూడదన్న ఉద్దేశ్యంతో పెద్దల ఆశీస్సులతో పిల్లలకు విద్యాభ్యాసం చేయించారు. స్థానిక కృష్ణ చైతన్య పబ్లిక్ స్కూల్ అధినేత జొన్నలగడ్డ విజయ్‌బాబు తోడ్పాటుతో ఉచితంగా ఎలిమెంటరీ స్కూల్ వరకు వేమూరులోని విద్యాభ్యాసం చేశారు. అనంతరం రేపల్లె క్రిస్టియన్ రెసిడెన్షియల్ స్కూల్లో హాస్టల్లో విద్యార్థిగా, కొంతకాలం తరువాత కావూరు ప్రభుత్వ హాస్టల్లో ఉండి విద్యాభ్యాసం చేశారు. పదో తరగతి ఇంటర్మీడియట్ తమకు స్ఫూర్తి ప్రధాత ఎన్నారై విద్యా సంస్థల అధినేత ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఉచితంగా విద్యనందించారని బెల్లంకొండ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. రామయ్య రాయుడు ఒంగోలులో బీటెక్ పూర్తి చేసి బ్యాంకు జాబ్ పొందారు. మండలంలోని జంపని కెనరా బ్యాంక్ మేనేజర్‌గా పని చేస్తూ 2024గ్రూప్ 2 పరీక్ష వ్రాసి ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రామయ్య రాయుడు విలేఖర్లతో మాట్లాడుతూ కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగం సాధించి పది మందికి మంచి చేయాలనే సదుద్దేశ్యంతో సాధించగలిగానని పేర్కొన్నారు.

## ఘనంగా భీష్మ ఏకాదశి

**భట్టిప్రోలు(రేపల్లె), జనవరి 29, ప్రభాతవార్త:** భట్టిప్రోలులోని సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమంలో గురువారం భక్తి శ్రద్ధలతో భీష్మ ఏకాదశి కార్యక్రమం నిర్వహించారు.విష్ణు సహస్రనామ పారాయణం,గీత కర్పూర యజ్ఞం,భీష్మాచార్యుల చరిత్ర సత్సంగం తదితర కార్యక్రమాలు జరిగాయి. సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమం అధ్యక్షురాలు బూర్లె అరుణకుమారి మాట్లాడుతూ ఏకాదశి



నాడు భీష్ముడు అంపశయ్యపై ఉండి శ్రీకృష్ణుడిని స్తుతించి మోక్షం పొందడం వలన భీష్మ ఏకాదశి అనే పేరు వచ్చిందన్నారు.ఇంతటి మహిమ కలిగిన ఏకాదశి విజయాలను శత్రువుల విముక్తిని కలిగిస్తుందని ఆమె తెలిపారు.భీష్మ పితామహుడు పాండవులకు చేసిన మహోపదేశం శ్రీ విష్ణు సహస్రనామమేనని ఆమె పేర్కొన్నారు.మాఘ పౌర్ణమి ముందు వచ్చే ఏకాదశి శ్రీ మహావిష్ణువుకు అత్యంత ప్రీతికర మని భీష్మ ఏకాదశి రోజున విష్ణు సహస్ర పారాయణం చేసే భక్తులు ఉత్తమ ఫలితాలు పొందుతారని అరుణకుమారి వెల్లడించారు. పూర్తిగా లేదా పాక్షికంగా ఉపవాస దీక్ష చేసిన భక్తులకు మేలు జరుగుతుందని ఆమె తెలిపారు.ఈ కార్య క్రమంలో కాళంగి హేమలత,పులికొండ దేవసేన ఆండాలు, బి.రాజరాజేశ్వరి,దర్శి శశికళ,బొలిశెట్టి జ్యోతిర్మయి,జల్లూరి వాణి,భక్తులు పాల్గొన్నారు.

## పట్టణంలో పచ్చదనం కోల్పోతున్న మొక్కలు

రేపల్లె, జనవరి 29, ప్రభాతవార్త:రాష్ట్ర ప్రభుత్వం 2047 విజన్‌లో భాగంగా పరిశుభ్రత,వ్యర్థాల నిర్వహణ,పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను ఆదర్శవంతమైన ఆరోగ్యకరమైన రాష్ట్రంగా



తీర్చిదిద్దేందుకు స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించింది. పేదరికం లేని సంపన్నమైన సంతోషకరమైన స్వర్ణాంధ్రను సాధించడంతో పాటు ప్రతి గ్రామం,పట్టణం పరిశుభ్రంగా ఉండేలా చేయడం వంటి విధి విధానాలను రూపొందించింది. ప్రతి నెలలో 3వ శనివారం స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. విద్యార్థులు, ప్రభుత్వ సిబ్బంది,ప్రజాప్రతినిధులు,ప్రజలను భాగస్వాములను చేస్తూ పరిసరాలను శుభ్రపరచడం,పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది.ప్రధానంగా పచ్చదనం వృద్ధికి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.రేపల్లె పట్టణంలోని తాలూకా ప్రభుత్వ కార్యాలయాలకు ముందు,ప్రధాన రహదారి పక్కన అధికారులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఆర్భాటంగా కార్యక్రమం పూర్తి చేశారు. తరువాత వాటి ఆలనా పాలనా ఆదమర్చారు.నాటిన మొక్కల లో కొన్ని ఎండాయి.మరికొన్ని పచ్చదనం కోల్పోతున్నాయి.ఈ మొక్కలకు నీరు పోసి రక్షించాలనే ఆలోచన రావడంలేదు. పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్‌కు తోడ్పడతానని పచ్చదనం పెంపొందిస్తాననే ప్రతిజ్ఞ చేయించారు.ఓల్డు టౌన్ ప్రాంతంలో మొక్కలు నాటారు.మొక్కల పెంపకంపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలు ప్రజల నుంచి వస్తున్నాయి. నాటిన మొక్కలు జీవం కోల్పోకుండా పచ్చదనం అభివృద్ధి చెందే విధంగా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత రేపల్లె మున్సిపల్ శాఖపై ఉందని ప్రజలు సూచిస్తున్నారు.

## విధిగా హెల్మెట్ ధరించాలి : ఎస్ఐ

రేపల్లె, జనవరి 29, ప్రభాతవార్త:ద్విచక్ర వాహనదారులు డ్రైవింగ్ సమయంలో విధిగా హెల్మెట్ ధరించాలని రేపల్లె ఎస్ఐ డి.వి.ఎస్.రాజ్యలక్ష్మి చెప్పారు.గురువారం ఆమె మాట్లాడుతూ హెల్మెట్ ధరించకుంటే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సురక్షితమైన ప్రయాణం చేయాలంటే హెల్మెట్ తప్పనిసరిగా ఉపయోగించాలని ఆమె సూచించారు.నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయకూడదని చెప్పారు.మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణంకారాదని ఆమె పేర్కొన్నారు.మద్యం సేవించి వాహనాలు నడిపినా మితిమీరిన వేగంతో వాహనాలు డ్రైవింగ్ చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాజ్యలక్ష్మి హెచ్చరించారు.శాంతి భద్రతలను పరిరక్షించడమే తమ కర్తవ్యమని ఆమె వెల్లడించారు.



## 31న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

రేపల్లె, జనవరి 29, ప్రభాతవార్త:రేపల్లె పురపాలక సంఘంలో శనివారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ అత్యవసర సమావేశం జరుగుతుందని ఛైర్‌పర్సన్ కట్టా మంగ గురువారం తెలిపారు.ఎజెండాలోని 48 అంశాలను చర్చించి ఆమోదించాల్సి ఉన్నందున కౌన్సిల్,కో ఆప్షన్ సభ్యులు విధిగా హాజరుకావాలని ఆమె కోరారు.

## పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసిన తెనాలి రూరల్ పోలీసులు

**తెనాలి టౌన్ జనవరి29(ప్రభాతవార్త):** పేకాట ఆడిస్తున్నాడని, అందిన సమాచారం మేరకు, తెనాలి ఎస్పి సీఐ ఆదేశాల మేరకు,తెనాలి రూరల్ ఎస్.ఐ.ఆనంద్ తన సిబ్బందితో మెరుపు దాడి చేసి తొమ్మిది మంది పేకాటరాయులను అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు, తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నేలపాడు గ్రామ సమీపాన పెట్రోల్ బంక్ వెనుక ముళ్ళ పొదల్లో, (చాకలి దేవదానం) సునీల్ అనే అతను పేకాట స్థావరం నెలకొల్పి,ప్రతిరోజు బయటి వ్యక్తుల చేత పేకాటలు ఆడిస్తున్నాడు. వారి వద్ద నుండి రెండు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, 4 సెల్ ఫోన్లు, పదివేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామని, నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, రూరల్ ఎస్సై ఆనంద్ తెలిపారు.




## మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు : ఎస్ఐ ప్రసాద్

**కొల్లిపర, జనవరి 29, ప్రభాతవార్త:** మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని కొల్లిపర ఎస్ఐ ప్రసాద్ హెచ్చరించారు.గురువారం మండలంలోని కొల్లిపర, మున్నంగి,వల్లభాపురం,హనుమాన్‌పాలెం తదితర



గ్రామాలలో పోలీస్ సిబ్బందితో కలసి రహదారి వాహనాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి ప్రమాదాలను అరికట్టేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.ప్రధానంగా యువకులు మితిమీరిన వేగంతో వాహనాలను నడిపి ప్రాణాలమీదకు తెచ్చుకోరాదని ఆయన సూచించారు.తప్పని సరిగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్,కారు నడిపేవారు సీట్ బెల్ట్‌ధరించాలన్నారు.లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. మైనర్లు ద్విచక్రవాహనాలు, ఇతర రకాల వాహనాలు నడిపితే వాహనాల యజమానులు, తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.ప్రతి వాహనానికి తప్పనిసరిగా నెంబర్ ప్లేట్ కనిపించే విధంగా చూసుకోవాలని ఆయన చెప్పారు. వాహనదారులు నిబంధనలు విస్మరిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

## ఆర్డీవోకు ఉచిత నాటకం ప్రదర్శన బ్రోచర్లు అందజేత



**రేపల్లె, జనవరి 29, ప్రభాతవార్త:** పట్టణంలోని మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ హాలులో సోమవారం సాయంత్రం 6.30 గంటలకు ప్రదర్శించే బుద్ధునితో నా(డాక్టర్ బిఆర్.అంబేద్కర్) ప్రయాణం నాటకం ప్రచార కార్యక్రమంలో భాగంగా రేపల్లె ఆర్డీవో ఎన్.రామలక్ష్మి,రేపల్లె తహశీల్దార్ ఎం.శ్రీనివాసరావులకు గురువారం నాటకం ప్రదర్శన బ్రోచర్లను కార్యనిర్వాహకులు అందజేశారు.ఈ నాటకాన్ని ఉచితంగా ప్రదర్శిస్తున్నట్లు వారు తెలిపారు.అధికారులను కలిసిన వారిలో డి.సాంబశివరావు,డి.రమేష్‌రాంజీ,రేపల్లె ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వాగోలు బాబూరావు,ఆళ్ళ మోషె తదితరులు ఉన్నారు.

